
సాక్షి
గుంటూరు
శుక్రవారం । 12 । జూలై । 2024



కనకదుర్గకు ఆషాఢసారె

మంగళగిరి: యర్రబాలెంకు చెందిన మహిళా భక్తులు బుధవారం విజయవాడ కనకదుర్గకు ఆషాఢం సారె సమర్పించారు. మంత్రి లోకేష్‌ను కలిసి రాజధానిని అభివృద్ధి చేయాలని కోరారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 1,616 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 203 క్యూసెక్కులు విడుదల చేశారు.



తిరుపతమ్మకు సారె సమర్పణ

ఆషాఢమాసం సందర్భంగా తిరుపతమ్మవారికి గురువారం పెనుగంచిప్రోలులోని భక్త సేవా సేవాసంఘం ఆధ్వర్యంలో మహిళలు సారె సమర్పించి బోనాలు చెల్లించారు.

న్యూస్‌రీల్

బియ్యం, కందిపప్పు కౌంటర్లు ప్రారంభం



చిలకలూరిపేట: పట్టణంలోని రైతుబజారులో బియ్యం, కందిపప్పు ప్రత్యేక కౌంటర్లను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం ఫైన్ రకం బియ్యం (స్టీమ్ రైస్) కిలో రూ. 55.85 ఉండగా, రైతు బజారులోని కౌంటర్‌లో రూ. 49కి విక్రయిస్తారని తెలిపారు. ఫైన్‌రకం ముడిలేదా రా రైస్ ప్రస్తుతం కిలో రూ. 52.40 ఉండగా, రూ. 48కే విక్రయిస్తారని వెల్లడించారు. కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో కిలో రూ. 174 ఉండగా, ఇక్కడ రూ.160కు విక్రయిస్తారని తెలిపారు. ఒకరికి బియ్యం ఐదు కేజీలు, కందిపప్పు ఒక కిలో చొప్పున విక్రయిస్తారన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి ఎస్.పద్మశ్రీ,, ఆర్డీఓ సూర్యప్రకాశ్, తూనికలు, కొలతల శాఖ అధికారి అల్లూరయ్య, తహసీల్దార్ జ్వాలా నరసింహ తదితరులు పాల్గొన్నారు.

డయేరియాతో మహిళ మృతి



తమ్మిశెట్టి తిరుపతమ్మ

పిడుగురాళ్ల: డయేరియాతో మహిళ మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని లెనిన్ నగర్‌కు చెందిన తమ్మిశెట్టి తిరుపతమ్మ(67) బట్టీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. గత ఆరు రోజుల నుంచి వాంతులు, విరేచనాలు కావటంతో స్థానిక మారుతి నగర్‌లోని వైద్యశాలలో చికిత్స పొందుతుండగా, మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ తిరుపతమ్మ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

సెయింట్ ఆన్స్ అధ్యాపకుడికి జాతీయ అవార్డు



వేటపాలెం: తమ అధ్యాపకుడు గర్నిపూడి దిలీప్‌కుమార్ జాతీయ స్థాయి అవార్డు సాధించినట్లు స్థానిక సెయింట్ ఆన్స్ ఫార్మసీ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్. లక్ష్మణరావు గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ ఎడ్యుకేషన్, సైంటిఫిక్ రీసెర్చ్‌పై కృషి చేసినందుకు సోలాపూర్‌కు చెందిన ఆవిష్కార్ ఫౌండేషన్ ఇటీవల నేషనల్ లెవల్ బెస్ట్ యంగ్ అధ్యాపక్ ఆఫ్ ది ఇయర్ అవార్డును దిలీప్‌కుమార్‌కు ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు. ఆయన రాసిన టెక్స్ట్ బుక్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఫార్మసీ-1 పాఠ్య గ్రంథాన్ని మహారాష్ట్రకు చెందిన ప్రీతమ్ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రచురించిందని ప్రిన్సిపాల్ పి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకుడిని అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్.వి. రమణమూర్తి, అధ్యాపకులు అభినందించారు.

27,246 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 26,349 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 27,246 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 17,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 10,000 నుంచి రూ. 15,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,800 నుంచి రూ. 18,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 16,946 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 503.20 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

తల్లికి వంచన

బిడ్డలను బడికి పంపే తల్లులకు వంచనే మిగిలిందా! అబద్ధపు హామీలు నమ్మిన అమ్మానాన్నల ఆశలు అడియాసలయ్యాయా! తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ రూ.15వేలు వచ్చే ఆస్కారం లేదా! తాజా ప్రభుత్వ ఉత్తర్వులు చూస్తుంటే అవుననే సమాధానమే వస్తోంది. ఎన్నికల ముందు ఎన్డీఏ కూటమి ఇచ్చిన మరో ప్రతిష్టాత్మక హామీకి సీఎం చంద్రబాబు తూట్లు పొడిచినట్టే కనిపిస్తోంది. ఫలితంగా తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఒక్కరికే వందనం !

- ఎన్డీఏ కూటమి ప్రతిష్టాత్మక హామీకి తూట్లు
- ఎన్నికల ముందు చదువుకుంటున్న పిల్లలందరికీ ఏటా రూ.15వేలు చొప్పున ఇస్తామన్న చంద్రబాబు
- తాజా ప్రభుత్వ ఉత్తర్వులతో తల్లిదండ్రుల్లో ఆందోళన
- జిల్లాలో 1 నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థులు 3.60 లక్షల మంది
- రూ.15 వేలు చొప్పున ఇవ్వాల్సిన నిధులు రూ.540 కోట్లు



స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికీ రూ.15వేలు ఇస్తామని కూటమి ఇచ్చిన రెండో హామీ (సర్కిల్లో)

సాక్షి ప్రతినిధి, గుంటూరు, గుంటూరు ఎడ్యుకేషన్ ఎన్డీఏ కూటమి ఉమ్మడి మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలకు ఒక్కోదానికి తిలోదకాలు వదులుతున్న రాష్ట్ర ప్రభుత్వం తాజాగా తల్లికి వందనం హామీకి మంగళం పాడుతోంది. ఈ మేరకు జీఓ నంబర్ 29 విడుదల చేసింది.

ఎన్నికల్లో విస్తృత ప్రచారం

ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్డీఏ కూటమిగా జతకట్టి ఇంట్లో ఎంత మంది బడికి వెళ్లే పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేలు చొప్పున తల్లికి వందనం పథకం ద్వారా అందిస్తామని నమ్మబలికారు. ప్రతి సభలోనూ ప్రగల్భాలు పలికారు. గుంటూరు జిల్లాలో జరిగిన ప్రచార సభల్లోనూ ఇద్దరు పిల్లలుంటే రూ.30 వేలు, ముగ్గురుంటే రూ.45 వేలు అంటూ హోరెత్తించారు. ఇప్పుడు బిడ్డలను బడికి పంపే తల్లికి రూ.15 వేలు ఇస్తామంటూ జీఓలో మెలికపెట్టారు. 75 శాతం హాజరు, ఆధార్ అనుసంధానం కావాలని, దారిద్ర్య రేఖకు దిగువన ఉండాలని నిబంధనలు పెట్టారు.

పాఠశాలలు తెరిచి నెలరోజులైనా..

పాఠశాలలు ప్రారంభమై శనివారానికి నెలరోజులు పూర్తవుతుంది. ఇప్పటికే తల్లికి వందనం పథకం అమలు కావాల్సి ఉంది. గత ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి వచ్చి ఉంటే జూన్ 21నే అమ్మఒడి పథకం ద్వారా ప్రతి తల్లి ఖాతాలో రూ.17 వేలు జమై ఉండేవి. కానీ కొత్త ప్రభుత్వం ఇంతవరకు తల్లికి వందనం అమలుపై దృష్టిపెట్టకపోగా ఇప్పుడు తాపీగా మోసపూరిత జీఓ ఇచ్చింది.

గత ప్రభుత్వంలో ఠంఛనుగా..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో అమ్మఒడి పథకాన్ని ఠంఛనుగా అమలు చేశారు. బిడ్డలను బడికి పంపే తల్లులకు ఏటా క్రమం తప్పకుండా రూ.15 వేల చొప్పున ఆర్థిక ప్రోత్సాహం అందించారు. ఇంటర్మీడియెట్ చదివే పిల్లల తల్లులకూ పథకాన్ని వర్తింపజేశారు. ప్రతి మాతృమూర్తి ఏటా రూ.15 వేలు చొప్పున నాలుగేళ్ల వ్యవధిలో రూ.60 వేలు అందుకున్నారు. గుంటూరు జిల్లాలో నాలుగేళ్లలో అమ్మఒడి ద్వారా రూ.938.62 కోట్ల ఆర్థిక లబ్ధి చేకూరింది.

మరిన్ని ఆంక్షలతో లబ్ధిదారులకు కోత!

జిల్లాలో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులు 3.60 లక్షల మంది ఉన్నారు. కేవలం ఇంటర్ చదువుతున్నవారు 60 వేల మంది ఉన్నారు. ఎన్డీఏ ఇచ్చిన హామీ మేరకు వీరందరికీ రూ.15 వేలు చొప్పున రూ.540 కోట్ల ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించాల్సి ఉంది. కానీ చంద్రబాబు ప్రభుత్వం పిల్లలు ఎంత మంది ఉన్నా.. ఒక్కరికే రూ.15వేలు ఇస్తామని జీవోతో తేల్చిచెప్పింది. దీంతో తల్లిదండ్రులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. దీనికి తోడు మరిన్ని నిబంధనలు విధించడంతోపాటు భారీగా లబ్ధిదారులకు కోత విధించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్టు తెలుస్తోంది.

ఇద్దరు పిల్లలకు ఇవ్వాలి



నాపేరు పెద్దపల్లి సునీత నాభర్త ప్రైవేట్ ఉద్యోగి. మాకు ఇద్దరు పిల్లలు. పెద్దబాబు 7వ తరగతి. చిన్నబాబు 5వ తరగతి. చిన్నబాబుకు గతంలో అమ్మఒడి పథకం వచ్చింది. ఇద్దరికీ తల్లికి వందనం వర్తింపజేయాలి. ఒకరికే అనడం సరికాదు.

– పెద్దపల్లి సునీత, తెనాలి

వైఎస్ జగన్ ప్రభుత్వంలో అమ్మఒడి ఆర్థిక లబ్ధి ఇలా

విద్యాసంవత్సరం	తల్లుల సంఖ్య	ఆర్థిక లబ్ధి (రూ.కోట్లలో)
2019-20	1,46,232	219.34
2020-21	1,55,330	232.99
2021-22	1,64,601	246.90
2022-23	1,59,594	239.39
మొత్తం		938.62

నాలుగేళ్లలో ప్రతి తల్లికీ అమ్మఒడి ద్వారా అందిన మొత్తం : రూ.60,000

పిల్లలందరికీ ఇవ్వాలి



తల్లికి వందనం పథకం ద్వారా పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందిస్తామన్న నగదును జాప్యం లేకుండా వెంటనే ఇవ్వాలి ఎన్నికల ముందు ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15వేలు చొప్పున ఇస్తామని చెప్పి ఇప్పుడు ఒక్కరికే ఇస్తామని ప్రకటించటం మోసం చేసినట్లే. అందరికీ ఇవ్వాల్సిందే.

– గుంటూరు శ్రీరెడ్డి, కొత్తరెడ్డిపాలెం, చేబ్రోలు

హామీని నిలబెట్టుకోవాలి



కూటమి నాయకులు ఎన్నికలకు ముందు తల్లికి వందనం పథకం ద్వారా ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ రూ.15వేలు చొప్పున ఇస్తామని చెప్పారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. నా ముగ్గురు పిల్లలు చదువుతున్నారు. ప్రస్తుతం కుటుంబంలో ఒక్కరికే అని జీవో విడుదల చేసినట్టు చెబుతున్నారు. అదే నిజమైతే ప్రజలను మోసం చేసినట్లే. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమ్మఒడి వచ్చింది.

– కంచర్ల మాణిక్యం, అన్నపూర్ణమ్మ కాలనీ, వడ్లమూడి, చేబ్రోలు.

జనాభా పోస్టర్ ఆవిష్కరణ



గుంటూరు వెస్ట్: ప్రపంచ జనాభా పోస్టర్‌ను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, అధికారులు ఆవిష్కరించారు. గురువారం కలెక్టరేట్‌లో ప్రపంచ జానాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి, డీపీఎంఓ డాక్టర్ రత్నమన్మోహన్, అధికారులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం



ఫిరంగిపురం: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి చెప్పారు. శాంతిపేట ఎంపీపీఎస్ పాఠశాలను గురువారం ఆయన పరిశీలించారు. హాజరు పట్టిక, రిజిస్టర్లు పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. 3,4,5 తరగతుల విద్యార్థులకు బేస్మెంట్ పరీక్షలు నిర్వహించి సామర్థ్యాల వారీగా పాఠాలు బోధించాలని చెప్పారు. విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంఈవో-1 మహబూబ్ సుభాని, ఎంఈఓ-2 రవికాంత్ పాల్గొన్నారు.

ఇసుకతక్కిడి..!

ఉచితం కాదు.. తడిసి మోపెడే

- స్టాక్ పాయింట్లలో నిల్వ
- తవ్వకాల ఖర్చు, సీనరేజీ, జీఎస్టీ పేరిట టన్ను ఇసుక రూ.250
- తెలుగు తమ్ముళ్ల కనుసన్నల్లో స్టాక్ పాయింట్లు
- తమ వారికి ఎక్కువ ఇసుక లోడింగ్
- వేబ్రిడ్జిలు లేక జేసీబీ బక్కెట్‌తో కొలత!



తుళ్ళూరు మండలం తాళ్లాయపాలెం రీచ్‌లో లారీలో ఇసుక నింపుతున్న జేసీబీ

సాక్షి ప్రతినిధి, గుంటూరు: పేరుకే ఉచిత ఇసుక.. లోడింగ్, సీనరేజి, జీఎస్టీ, రవాణా చార్జీలు కలుపుకుంటే తడిసి మోపెడు అవుతోంది. ఎన్నికల సమయంలో ఉచిత ఇసుక ఇస్తామంటూ వాగ్దానం చేసిన ప్రభుత్వం స్టాక్ యార్డుల వద్ద టన్నుకు రూ.250గా ధర నిర్ణయించింది. అంటే 20 టన్నుల లారీకి రూ.5,000 చెల్లించాలి. ఇది కాకుండా రవాణా అదనం. తాళ్లాయపాలెం నుంచి గుంటూరుకు ఇసుక లారీ తీసుకురావాలంటే రూ.15,000లకుపైనే అవుతోంది. కాకుమాను వంటి దూర ప్రాంతాలకు ఇది మరింత భారంగా మారింది.

నిర్వహణ తెలుగు తమ్ముళ్లదే..

ఉచిత ఇసుక పథకం అని గొప్పగా చెబుతున్నా స్టాక్ యార్డుల వద్ద లోడింగ్, సీనరేజీ, జీఎస్టీ చార్జీల పేరుతో టన్నుకు రూ.250 చొప్పున ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. స్టాక్ యార్డుల నిర్వహణ అంతా తెలుగు తమ్ముళ్ల చేతుల్లోనే నడుస్తోంది. అధికారులు అక్కడే ఉన్నా వారిది ప్రేక్షకపాత్ర మాత్రమే. దీంతో ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువే వసూలు చేస్తున్నారు.

అనుచరులకు లోడింగ్

తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం, లింగాయపాలెం ఇసుక రీచ్‌లలో మొత్తం 6 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయి. ప్రస్తుతం రెండు రీచ్‌ల ద్వారా డ్వాక్రా గ్రామైక్య సంఘాన్ని పెట్టి క్యూ ఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు చేసి ఇసుకను తరలిస్తున్నారు. రెండు రీచ్‌ల వద్ద తెలుగుదేశం నేతలు చేరి వారి కనుసన్నల్లో నడుపుతున్నారు. ఇసుకను తమ అనుచరులకే ఎక్కువ వెళ్లేలా చూస్తున్నారు.

తూకంలోనూ మోసం

లోడింగ్‌కు సంబంధించి కచ్చితమైన తూకంవేసే వేబ్రిడ్జి ఏర్పాట్లు లేకపోవడంతో ఇష్టారీతిగా లోడింగ్ జరుగుతుంది. ఇక్కడ వేబ్రిడ్జి లేదు. జేసీబీ బక్కెట్‌తో ఇసుక లోడింగ్ చేస్తున్నారు. బక్కెట్ సుమారుగా 2 నుంచి 2.5 టన్నుల సామర్థ్యం గలదని, ట్రాక్టర్‌కు రెండు బక్కెట్లు వేసి, 4 మెట్రిక్ టన్నులుగా నిర్ణయిస్తున్నారు. ఆరు యూనిట్ల లారీకి 10 బక్కెట్ల ఇసుక లోడ్ చేసి 20 మెట్రిక్ టన్నులుగా రూ.5,000 వసూలు చేస్తున్నారు. బిల్లులు ఇవ్వడం, నగదు చెల్లింపులు చేయడం వరకే అధికారులు, డ్వాక్రా బృందం చేస్తుండగా తెలుగుదేశం నాయకులు తమ కనుసన్నల్లో ఉండే వారికి అధిక లోడింగ్ చేయిస్తూ ఇసుకను బయటకు తరలిస్తున్నారు. మైనింగ్ అధికారుల దాడులలోనూ ఈ వ్యవహారం బయటకు పొక్కడంతో కొద్దిమందికి జరిమానాలు విధించడంతోపాటు హెచ్చరికలు జారీ చేస్తున్నారని సమాచారం. తెలుగుదేశం నాయకుల కనుసన్నల్లో జరుగుతున్న ఈ తంతుపై పలువురు కొనుగోలుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

20 టన్నులకు రూ.11వేలు

తెనాలి నియోజకవర్గంలో కొల్లిపర మండలలో రెండు స్టాక్ పాయింట్లు ఉన్నాయి. ఒకటి కొల్లిపర, రెండోది మున్నంగి గ్రామం. కొల్లిపరలో 33,388.50 మెట్రిక్ టన్నులు, మున్నంగిలో 1,81,303.50 మెట్రిక్ టన్నుల నిల్వ ఉంది. ప్రస్తుతం రెండు స్టాక్ పాయింట్లలోనూ ప్రభుత్వం నిర్ణయించిన విధంగా టన్ను ఇసుక రూ.250 చొప్పున ఒక్కో వ్యక్తికి గరిష్టంగా 20 టన్నులను లోడు చేస్తున్నారు. 20 టన్నులకు రూ.5,000 అవుతోంది. కొల్లిపర నుంచి తెనాలికి చేరేందుకు ఇసుక ధరతో పాటు రవాణా ఖర్చులు కలిపి రూ.11 వేలు అవుతుండగా, మున్నంగి నుంచి తెనాలికి చేరేందుకు ఇసుక ధరతోపాటు రవాణా ఖర్చులు కలిసి రూ.11,500 అవుతోంది. ఇది జిల్లా కేంద్రమైన గుంటూరు, పొన్నూరు ప్రత్తిపాడు నియోజకవర్గాలకు చేరే సరికి ఇది మరింత భారం అవుతోంది.

జిల్లావ్యాప్తంగా ఇసుక ధరలు ఇలా.. (రూపాయల్లో)

నియోజకవర్గం	టన్ను ఇసుక ధర	టన్నుకు రవాణా చార్జి	టన్నుకు మొత్తం ఖర్చు	18 టన్నుల ధర రవాణాతో కలిపి
తెనాలి	250	300	550	9,900
తాడికొండ	250	300	550	9,900
మంగళగిరి	250	300	550	9,900
గుంటూరు వెస్ట్	250	500	750	13,500
గుంటూరు ఈస్ట్	250	500	750	13,500
ప్రత్తిపాడు	250	600	850	15,300
పొన్నూరు	250	600	850	15,300

వైభవంగా ఇస్కాన్ జగన్నాథ రథయాత్ర

రథాన్ని లాగి యాత్రను ప్రారంభించిన మంత్రి నారా లోకేష్

మంగళగిరి: మంగళగిరిలో గురువారం ఇస్కాన్ ఆధ్వర్యంలో జగన్నాథుని రథయాత్ర వైభవంగా జరిగింది. మంగళగిరి ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరై యాత్రను ప్రారంభించారు. జగన్నాథుడు, బలరాముడు, సుభద్రల విగ్రహాలకు హారతులు ఇచ్చిన లోకేష్ అనంతరం రథోత్సవాన్ని ప్రారంభించారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ ప్రజా సేవ అంటే పరమాత్ముడి సేవ అన్నారు. ప్రపంచం దృష్టి మంగళగిరి వైపు ఉందని, దేవుడి ఆశీస్సులతో ప్రజలకు మెరుగైన సేవలందిస్తామని పేర్కొన్నారు. జగన్నాథుని ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.



రథంపై పూజలు చేస్తున్న మంత్రి నారా లోకేష్

టిడ్కో ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తిచేయాలి

కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: పేద ప్రజల నివాసం కోసం రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన టిడ్కో గృహాల నిర్మాణం వేగంగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఫేజ్-2లో భాగంగా గుంటూరు శివారు వెంగళాయపాలెంలో నిర్మించాల్సిన 1,392 టిడ్కో గృహాలతోపాటు తెనాలిలోని పూలే కాలనీలో నిర్మించాల్సిన 1,008 గృహాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. టిడ్కో ఎస్ఈ ఎం.సీహెచ్.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఫేజ్-1లో భాగంగా వెంగళాయపాలెంలో నిర్మించిన 1,088 ఇళ్లను ఇప్పటికే లబ్ధిదారులకు స్వాధీనం చేశామన్నారు. ఫేజ్-2లోని 1,392 గృహాల పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు అడవి తక్కెళ్ళపాడులో 4,192, మంగళగిరిలో 1,728, తెనాలిలో 848, పొన్నూరులో 2,368 గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేశామని చెప్పారు. సీఆర్డీఏ పరిధిలోని నవులూరు, నిడమర్రు, పెనుమాక, అనంతవరం, దొండపాడు, తుళ్ళూరు, ఐనవోలు, మందడంలలో నిర్మించిన 5,024 గృహాలను స్వాధీనం చేశామని వెల్లడించారు. సమావేశంలో టిడ్కో ఈఈ జి.ప్రసాదరావు, డీఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండండి

- మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ
- డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన

పిడుగురాళ్ల: డయేరియా ప్రబలిన ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్లలోని లెనిన్‌నగర్, మారుతీనగర్ ప్రాంతాలను గురువారం మంత్రి పరిశీలించారు. ముందుగా లెనిన్ నగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగుల వివరాలు అడిగి తెలుసుకొని, డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండటంపై అధికారులను ప్రశ్నించారు. అనంతరం పైపులైన్ లీకైన ప్రాంతాన్ని పరిశీలించి ప్రజలకు మంచినీటిని ఎలా సరఫరా చేస్తున్నారని అధికారులను అడిగారు. అనంతరం ఆర్అండ్‌బీ బంగ్లాలో జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి నారాయణ మాట్లాడుతూ పట్టణంలో ఇప్పటికి 60 కేసులు నమోదు అయ్యాయని, ప్రస్తుతం 39 మంది వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. చికిత్స పొందుతున్న వారి ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. పట్టణానికి కృష్ణానది ద్వారా నీటిని అందించేందుకు 16 కిలోమీటర్ల మేర పైపులైన్ ఉందని, అయితే ఎక్కడ లీక్ అయిందో తెలియదన్నారు. ఐదు రోజుల నుంచి నీటి సరఫరాను నిలిపివేయటం జరిగిందన్నారు. ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నామని తెలిపారు. స్థానిక వాటర్‌ప్లాంట్లల్లో కూడా శాంపిల్స్‌ను పరిశీలించటం జరుగుతుందన్నారు. మారుతీనగర్, లెనిన్‌నగర్ ప్రాంతాల్లోని కాలువల్లో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని, మురుగు పారుదల సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. జిల్లా వైద్యాధికారి రవి, గురజాల ఆర్డీఓ రమాకాంత్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



లెనిన్ నగర్ పీహెచ్‌సీలో రోగులను పరామర్శిస్తున్న మంత్రి నారాయణ

నల్లపాడు సీఐగా వంశీధర్



గుంటూరు రూరల్: నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐగా కె.వంశీధర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన సీఐ నరేష్‌కుమార్ పలు సమస్యల నేపథ్యంలో వీఆర్‌కు వెళ్ళగా ఆ స్థానంలో వంశీధర్ బాధ్యతలు స్వీకరించారు. వంశీధర్ గతంలో సత్తెనపల్లి, కొత్తపేట తదితర పోలీస్ స్టేషన్లలో పనిచేశారు. సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు.

కొద్దిరోజుల్లోనే అనేక మార్పులు

గతంలో ఇక్కడ పనిచేసిన సీఐ నరేష్‌కుమార్ సివిల్ వివాదంలో తలదూర్చారనే నెపంతో కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే సెలవుపై వెళ్లాలని ప్రజాప్రతినిధులు ఒత్తిడి చేశారు. ఈ నేపథ్యంలో నరేష్‌కుమార్ ఐదు రోజుల సెలవుపై వెళ్లారు. అనంతరం ఇన్‌చార్జ్ సీఐగా సీసీఎస్‌లో పనిచేస్తున్న వెంకన్నచౌదరిని ఆయనకు ఇష్టంలేకున్నా ఉన్నతాధికారులు పంపారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన మూడు రోజుల్లోనే సెలవులో ఉన్న నరేష్‌కుమార్‌ను బుధవారం విధుల్లో చేరాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో ఉదయం బాధ్యతలు స్వీకరించిన నరేష్‌కుమార్‌ను వీఆర్‌కు పంపిస్తూ బుధవారం అర్ధరాత్రి ఉన్నతాధికారులు డీవో విడుదల చేశారు. ఇన్‌చార్జ్‌గా ప్రస్తుతం నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా ఉన్న సత్యనారాయణకు బాధ్యతలు అప్పగిస్తూ రాత్రికి రాత్రే ఉత్తర్వులు జారీ చేశారు. మళ్లీ గురువారం మధ్యాహ్నానికి నూతన సీఐగా కె.వంశీధర్ బాధ్యతలు స్వీకరించారు. రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో ఇంత గందరగోళం నెలకొందనే వాదన వినిపిస్తోంది.

క్లుప్తంగా

త్రోబాల్ పోటీలు ప్రారంభం



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఆంధ్రా, తెలంగాణ రాష్ట్ర స్థాయి సీబీఎస్ఈ పాఠశాలల త్రోబాల్ పోటీలను గురువారం ఫాదర్ డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య ప్రారంభించారు. అండర్–14, 17, 19 బాలికల విభాగాలకు స్థానిక విద్యానగర్‌లోని స్టెమ్ స్కూల్లో పోటీలు నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్రాల నుంచి దాదాపు 600 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో పోటీల నిర్వహణ కార్యదర్శి ఫాదర్ భరత్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ అనుపమ, రమాదేవి, సావేరి, సంధ్య, చీఫ్ కోచ్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,600, గరిష్ట ధర రూ.4,200, మోడల్ ధర రూ.3,400 వరకు పలికింది.

నష్టపోయిన మిర్చి రైతులకు పరిహారం ఇవ్వాలి

క్రోసూరు: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆమంచి విజ్ఞాన కేంద్రంలో మిర్చి బాధిత రైతులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ గత ఖరీఫ్ సీజన్లో అచ్చంపేట మండలం తాళ్ల చెరువు గ్రామంలో 100 మంది రైతులు 250 ఎకరాల వరకు యూఎస్ 450 రకం మిర్చి పంట వేసి నష్టపోవడం జరిగిందని, ఈ విషయమై పంట మొదటి దశలోనే పూత, పిందె సరిగా రాకపోవడంతో కంపెనీ, అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ రైతులకు ఎటువంటి ప్రయోజనం కలగలేదని, వెంటనే సమస్యను పరిశీలించి బాధిత రైతులకు ఎకరానికి రూ.లక్ష పంట నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత సెప్టెంబర్‌లో కంపెనీవారు పంటలను పరిశీలించి జనవరి నెల నుంచి పంట వస్తుందని చెప్పటంతో రైతులు వేచి చూశారన్నారు. మార్చి నెల వరకు కూడా ఎటువంటి పంట రాకపోవడంతో రైతులలో ఆందోళన మొదలై స్థానిక ఉద్యానశాఖ అధికారి, వ్యవసాయశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. కంపెనీ వారు పంటలను పరిశీలించి బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లిస్తారని చెప్పి ఆరు నెలలు కావస్తున్నప్పటికీ నష్టపరిహారం చెల్లించలేదన్నారు.

అన్ని పాఠశాలల్లో స్కౌట్ యూనిట్లు

జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో స్కౌట్ యూనిట్లను స్థాపించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ పేర్కొన్నారు. గురువారం డీఈఓ కార్యాలయంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అకడమిక్ క్యాలెండర్ రూపకల్పనపై సమావేశాన్ని నిర్వహించారు. డీఈవో శైలజ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ప్రధానోపాధ్యాయులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి, అన్ని పాఠశాలల్లో స్కౌట్స్ రిజిస్ట్రేషన్ చేయించాలని ఆదేశించారు. స్కౌట్ మాస్టర్స్, గైడ్ కెప్టెన్‌లు బాగా పని చేసి హెచ్‌ఎంలు, ఎంఈవోల పరిధిలోని ఉపాధ్యాయులను ప్రోత్సహించి కొత్తగా స్కౌట్ యూనిట్లను ఏర్పాటు చేయించి, సభ్యత్వ నమోదు పెంచాలని సూచించారు. అకడమిక్ క్యాలెండర్‌ను అనుసరించి జూలైలో స్కౌట్ మాస్టర్‌కు బేసిక్ శిక్షణతోపాటు ఆగస్టులో విద్యార్థులకు తృతీయ సోపానం శిబిరాన్ని నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కార్యనిర్వాహక కమిషనర్ పి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి ఎం.ఏడుకొండలు, గుంటూరు డీవైఈవో పి.వెంకటేశ్వరరావు, ఏఎస్‌టీసీ ఎస్‌కే నజీర్, వీపీ డాక్టర్ కుమార్, ఇ.అనిల్‌కుమార్, ఎం.శ్రీహరి, టి.నరేష్, కె. కామాక్షి, డి.ప్రసన్న కుమారి, ఎస్.మల్లేశ్వరి, వరకమల కుమారి తదితరులు పాల్గొన్నారు.



స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపాధ్యాయులతో డీఈవో శైలజ, డీవైఈవో వెంకటేశ్వరరావు

వెస్ట్ గోదావరిపై చిత్తూరు భారీ ఆధిక్యం

మంగళగిరి: అమరావతి క్రికెట్ టౌన్‌షిప్‌లోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న అండర్–16 మెన్ అంతర్ క్రికెట్ పోటీలలో గురువారం జరిగిన మ్యాచ్ -05లో వెస్ట్ గోదావరి జట్టుపై చిత్తూరు భారీ ఆధిక్యం సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన చిత్తూరు జట్టు బ్యాట్స్‌మెన్స్ చెలరేగిపోవడంతో 80.1 ఓవర్లలో 331 పరుగుల భారీ స్కోర్ సాధించింది. బ్యాట్స్‌మెన్ షోహాన్‌రెడ్డి ఒక సిక్స్, 14 ఫోర్లతో 119 బాల్స్‌లో 109 పరుగులు చేశాడు. మరో బ్యాట్స్‌మెన్ బి.నాగజితిన్ 11 ఫోర్లలో 130 బాల్స్‌లో 90 పరుగులు సాధించాడు. వెస్ట్ గోదావరి బౌలర్లలో వివేక్ జైన్ 14 ఓవర్లలో 14 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీయగా వెంకట నాగ మాథూర్ 18.1 ఓవర్లలో 75 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన వెస్ట్‌గోదావరి 6.3 ఓవర్లలో 22 పరుగులకే ఆలౌటైంది. దీంతో తొలిరోజు చిత్తూరు జట్టు 309 పరుగులు ఆధిక్యం సాధించింది.

రైళ్లలో పోగొట్టుకున్న 16 మంది సెల్‌ఫోన్లు అప్పగింత

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): రైళ్లలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న 16 మందికి జీఆర్పీ పోలీసులు న్యాయం చేశారు. ఫోన్లను రికవరీ చేసి బుధవారం అప్పగించారు. స్థానిక గుంటూరు రైల్వే జీఆర్పీ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ గంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రయాణికుల ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సెల్‌ఫోన్లను రికవరీ చేసి ఫిర్యాదుదారులకు అప్పగించినట్టు పేర్కొన్నారు. వీటి విలువ సుమారు రూ.3.40 లక్షల వరకు ఉంటుందని వెల్లడించారు. రైళ్లలో అనుమానితులు తారసపడితే తక్షణమే 139, 100 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ప్రయాణికులకు సూచించారు. ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో రైల్వే ఎస్సైలు రమేష్, వెంకటాద్రి, క్రైమ్ పార్టీ కానిస్టేబుల్స్ వలి, ఆర్‌పీఎఫ్, సీఐబీ సిబ్బంది పాల్గొన్నారు.



బాధితులకు సెల్‌ఫోన్లను అందించిన జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు, ఎస్సైలు వెంకటాద్రి, రమేష్ తదితరులు

వసతి గృహాల్లోని పిల్లలను సొంత బిడ్డల్లా చూడాలి

- మహిళలు, బాలికలకు చట్టాలపై అవగాహన ఉండాలి
- జిల్లాలోని పలు సెంటర్లను సందర్శించిన ట్రైనీ న్యాయమూర్తులు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): వసతి గృహాల్లోని పిల్లలను సొంత బిడ్డల్లా చూసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) టి.లీలావతి చెప్పారు. జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ (అమరావతి) ఆదేశాల మేరకు గురువారం జిల్లాలోని వన్‌స్టాప్ సెంటర్, స్వధార్ హోం, శిశుగృహ, హౌస్ కాలేజీ వాత్సల్య మిషన్, ఎస్.టి.బాలికల వసతి గృహాలను ట్రైనీ న్యాయమూర్తులు సందర్శించారు. ఆయా సెంటర్లలో మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా టి.లీలావతి మాట్లాడుతూ బాలికలు ఉన్నత చదువులు అభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో శిక్షణ (ట్రైనింగ్) న్యాయమూర్తులు జి.స్రవంతి (స్పెషల్ మొబైల్ మేజిస్ట్రేట్, గుంటూరు), ఐ.స్వాతి సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్, చిలకలూరి పేట, పి.వివేకవర్ధన్, సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్, తెనాలి), ఎం.మహతి సివిల్ జడ్జి (జూని యర్ డివిజన్, వినుకొండ), కె.వి.వి.సత్యనారాయణ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్, గురజాల), జి.రేణుకలత సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్, బాపట్ల), పి.ప్రియదర్శిని, సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్, సత్తెనపల్లి), సీపీడీఓ విజయ్‌కుమార్, వన్ స్టాప్ సెంటర్ విజయలక్ష్మి, శాంతి, శిల్ప, ఎస్.టి. బాలికల వసతిగృహ మహిళలు, బాలికలు, సిబ్బంది పాల్గొన్నారు.



బాలికల వసతి గృహంలో ట్రైనీ న్యాయమూర్తులు

విద్యార్థిని మెడలో చైన్ స్నాచింగ్

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని జరిగిన చైన్‌స్నాచింగ్ ఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. చైన్ స్నాచింగ్ విషయాన్ని బయటకి పొక్కకుండా తాడేపల్లి పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. సేకరించిన వివరాల ప్రకారం రాజమండ్రికి చెందిన నందిని కీర్తన అనే విద్యార్థిని కేఎల్‌యూలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతూ బయట హాస్టల్‌లో ఉంటోంది. ఈనెల 8న సోమవారం రాత్రి 10 గంటల సమయంలో భోజనం అనంతరం యూనివర్శిటీ సమీపంలోని వడ్డేశ్వరం–రేవేంద్రపాడు కరకట్టపై వాకింగ్ చేస్తుండగా ద్విచక్రవాహనంపై వచ్చిన యువకుడు ఆ విద్యార్థిని మెడలో ఉన్న 10 గ్రాముల బంగారపు చైన్‌ను లాక్కుని పారిపోయాడు. ఘటనపై విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాడేపల్లి ఎస్‌ఐ ప్రతాప్ కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు. గత నెల రోజుల్లో మంగళగిరి సబ్ డివిజన్‌లో నాలుగోసారి చైన్ స్నాచింగ్ జరిగింది. ఇప్పటికే చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని జైలుకు పంపారు.

వికసిత్ భారత్ కోసం ఉత్పత్తులపై దృష్టి పెట్టాలి

- ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి
- వీఐటీ– ఏపీలో అధునాతన నానో అప్లికేషన్స్‌పై వర్చువల్‌గా రెండో అంతర్జాతీయ సదస్సు

తాడికొండ: వికసిత్ భారత్‌గా మారాలంటే మనం ఎక్కువ కాగితాలపై కాకుండా మరిన్ని ఉత్పత్తులపై దృష్టిపెట్టాలని, బలమైన సహకారం ఉన్నప్పుడే ఇది సాధ్యమవుతుందని ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి అన్నారు. వీఐటి– ఏపీ విశ్వ విద్యాలయంలో స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ సైన్సెస్, సదరన్ డెన్మార్క్ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో అధునాతన నానో మెటీరియల్స్, అప్లికేషన్స్‌పై వర్చువల్ విధానంలో నిర్వహించిన రెండో అంతర్జాతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉత్పత్తులపై పట్టు సాధించాలంటే సంస్థలు, సంస్థలోని ఇతర విభాగాల మధ్య సమన్వయంతో కూడిన సహకారం ఎంతో అవసరమన్నారు. వీఐటీ ఏపీ వర్శిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి మాట్లాడుతూ అధ్యాపకులు రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులకు పరిశోధన కార్యక్రమాలకు వర్శిటీ ఎంతో సహకారం అందిస్తోందన్నారు. వర్శిటీ నూతన ఆవిష్కరణలు, పరిశోధనలు నిర్వహించడానికి సీడ్ గ్రాంట్‌లు అందిస్తున్నట్లు తెలిపారు. ఏటా అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్‌లు రూపొందించే పరిశోధన ప్రచురణలు, పేటెంట్‌లతోపాటు తమ వర్శిటీ సాధిస్తున్న ప్రగతిని వివరించారు. వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి మాట్లాడుతూ వీఐటీ ఏపీ విశ్వ విద్యాలయం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. డీన్ ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ సైన్సెస్ లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో ఎమిరిటస్ ప్రొఫెసర్ వీఆర్‌కే మూర్తి, స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ సైన్సెస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సంధ్యా సదానందన్, అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ రజినీ కాంత్ పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వర్చువల్ సదస్సులో ప్రసంగిస్తున్న అతిథులు

బస్సు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెనాలిరూరల్: బస్సు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన తెనాలి ఆర్టీసీ బస్టాండ్‌లో జరిగింది. పోలీసుల కథనం మేరకు సుమారు 30 నుంచి 40 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి తెనాలి ఆర్టీసీ బస్టాండ్‌లో రేపల్లె బస్సులు ఆగే ప్లాట్‌ఫాం వద్ద గురువారం సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో బస్సు ఎక్కే క్రమంలో కింద పడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. తోటి ప్రయాణికులు 108కు సమాచారం అందించగా వాహనంలో తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని వైద్యశాల మార్చురీకి తరలించారు. మృతుడిపైకి బస్సు ఎక్కడం కారణంగా మృతి చెందాడా లేదా అన్న అంశాన్ని పరిశీలిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూ టౌన్ సీఐ ఎ.సుధాకర్ తెలిపారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

27న కత్తి పద్మారావు రచనలు ఆవిష్కరణ



పొన్నూరు : ఈ నెల 27న కవి డాక్టర్ కత్తి పద్మారావు జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన రచించిన పలు పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాత రమాబాయి పురస్కార గ్రహీత కత్తి స్వర్ణ కుమారి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం గుంటూరు జిల్లా పొన్నూరులోని లుంబినీ వనంలోని అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌లో కార్యక్రమం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. లోకాయతా పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు. ఆహ్వాన పత్రిక ఆవిష్కరణలో దాసరి సేవలు, కట్ట సృజన, గుడి పూడి శాంతి, మదిర మరియరాణి పాల్గొన్నారు.

కాకినాడలో 27న ఏఏఎఫ్ ఆవిర్భావ సభ

తెనాలిరూరల్: అంబేడ్కర్ ఆలోచన ఫౌండేషన్(ఏఏఎఫ్) 17వ ఆవిర్భావ సభ, రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ ఈ నెల 27న కాకినాడలో జరుగుతుందని ఫౌండేషన్ గుంటూరు పార్లమెంట్ అధ్యక్షుడు దాసరి శ్రీధర్ తెలిపారు. సదస్సు కరపత్రాలను గురువారం తెనాలి కోర్టుల ప్రాంగణంలో ఆవిష్కరించారు. శ్రీధర్ మాట్లాడుతూ కాకినాడ డి–కన్వెన్షన్ హాలులో ఫౌండేషన్ చైర్మన్ పినిపే రామకృష్ణ, రాష్ట్ర కన్వీనర్ బైపా అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో జరుగుతుందని చెప్పారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులు, విశ్రాంత న్యాయమూర్తులు, సివిల్ సర్వీసెస్ అధికారులు, సీనియర్ జర్నలిస్టులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు గుమ్మడి రవి రాజు, కొక్కిలిగడ్డ ప్రకాష్, మధిర సురేష్ బాబు, జిలుగు రామారావు, తలతోటి సుధాకర్, పెరికల డానియల్, కంచర్ల సుబ్బారావు, కనపర్తి వెంకటేశ్వరరావు, బత్తుల వీరకుమార్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న దాసరి శ్రీధర్

చట్టాలపై విద్యార్థినులకు అవగాహన అవసరం

జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ కన్వీనర్ శ్రీనివాస్

రెంటచింతల: భారతీయ న్యాయ సంహితలో మహిళలు, బాలికల సంరక్షణ కోసం రూపొందించిన చట్టాలపై వచ్చిన మార్పులపై విద్యార్థినులు ఖచ్చితంగా అవగాహన కలిగి ఉండాలని పల్నాడు జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ కన్వీనర్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మిట్టగుడిపాడు గ్రామ శివార్లోని కేజీబీవీ విద్యార్థినులకు గురువారం నిర్వహించిన మిషన్ శక్తి భారతీయ న్యాయ సంహిత అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు, బాలబాలికల సంరక్షణ కోసం పొందుపరచిన చట్టాలపై విద్యార్థినులు, మహిళలకు అవగాహన కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 100 రోజులపాటు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐసీడీఎస్ రెంటచింతల మండల సూపర్‌వైజర్ వై.శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాజకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న శ్రీనివాస్

వేప చెట్లు నరికి.. రూ. లక్ష స్వాహా చేసి..

సత్తెనపల్లి: అనుమతులకు విరుద్ధంగా 10 వేప చెట్లను నరికి రూ. లక్ష స్వాహా చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. అమరావతి మేజర్‌లో గల ఎఫ్.మైనర్ రైలు కట్ట నుంచి అమరావతి మేజర్ వరకు గత 25 ఏళ్లుగా ఏడు వేపచెట్లు భారీగా పెరిగాయి. ఈ చెట్లను కొందరు వ్యక్తులు చెట్లను నరికి ముక్కలుగా తీసుకువెళ్లారు. స్థానిక రైతులు జలవనరుల శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
అదేవిధంగా సత్తెనపల్లి మండలం నందిగామ రోడ్ లో గల పెట్రోల్ బంకు దిగువ భాగంలో ఉన్న మూడు వేప చెట్లను అక్రమంగా నరికి తీసుకెళ్లారు. మొత్తం ఈ పది వేప చెట్ల విలువ రూ. లక్ష పైనే ఉంటుందని స్థానిక రైతులు తెలిపారు. వీటి అక్రమ తరలింపులో జల వనరుల శాఖకు చెందిన ఓ అసిస్టెంట్ ఇంజినీర్ హస్తం ఉందనే ప్రచారం జరుగుతుంది. అంతేకాక వేప చెట్లు నరికి వాటి కొమ్మలను అడ్డదిడ్డంగా పడ వేయడంతో ఆయా ప్రాంత రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పర్యావరణానికి మేలు చేకూర్చే భారీ వేప చెట్లను నరికి అక్రమంగా విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



రసవత్తరంగా కర్నూలు-కడప మ్యాచ్

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్–16 బాలుర క్రికెట్ పోటీలలో కర్నూలు, కడప జిల్లాల మధ్య జరుగుతున్న మ్యాచ్ ఆసక్తికరంగా మారింది. కర్నూలు జట్టు తన తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులు చేయగా కడప జట్టు తొలి ఇన్నింగ్స్ బుధవారం నాటి ఓవర్‌నైట్ స్కోర్ 4 వికెట్లు నష్టానికి 21 పరుగులతో రెండవరోజు గురువారం ఆట ప్రారంభించి 136 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని జి.వి.సాయిసాకేత్ 52 పరుగులు చేయగా, కర్నూలు బౌలర్ బి.మహిత్‌కు 5 వికెట్లు లభించాయి. తొలి ఇన్నింగ్స్‌లో 62 పరుగుల ఆధిక్యంలో ఉన్న కర్నూలు జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి తన రెండవ ఇన్నింగ్స్‌లో 8 వికెట్ల నష్టానికి 117 పరుగులు చేసింది. కర్నూలు జట్టుకు 179 పరుగుల ఆధిక్యత లభించగా ఇంకా 2 వికెట్లు చేతిలో ఉన్నాయి. శుక్రవారం మూడవ రోజు ఆట కొనసాగనుంది.

బహుముఖ ప్రజ్ఞాశాలి 'సినారె'



సమావేశంలో పాల్గొన్న సాహితీవేత్తలు

అద్దంకి రూరల్: మధురమైన సినీ గీతాలతో పాటు ఎన్నో కవితలు, సాహిత్య గ్రంథాల్ని రచించిన బహుముఖ ప్రజ్ఞాశాలి సి.నారాయణ రెడ్డి అని సాహితీవేత్త గాడేపల్లి దివాకరదత్తు కొనియాడారు. సాహితీ ప్రవంతి ఆధ్వర్యంలో గురువారం స్థానిక దత్తసాయి క్లినిక్ ఆవరణలో సి.నారాయణరెడ్డి జీవితం, సాహిత్యంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దివాకరదత్తు మాట్లాడుతూ ఎన్నో గ్రంథాలతో పాటు గొప్ప శైలిలో వందలాది సినీ పాటల్ని రచించి సినారేగా పేరు గడించారన్నారు. విశ్వంభర రచనకు జ్ఞానపీఠ్ అవార్డు రావడం తెలుగు వారందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. అనంతరం అద్దంకిలో పోస్టల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన ప్రముఖ సాహితీ విశ్లేషకుడు ఆర్.వి. రాఘవరావును సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు చందలూరి నారాయణ రావు, డీవీఎం సత్యనారాయణ, ఇలపావులూరి శేషతల్పశాయి, మిట్టా కామేశ్వరరావు, మిట్టా కామేశ్వరశర్మ, రామదాసు, బాలు, అంజయ్య, రఘురామశర్మ, వీరయ్య పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ధాన్యం, పప్పుల ధరలు

వేమూరు: ప్రజలకు అందుబాటులో ధాన్యం, పప్పుల ధరల్ని ప్రభుత్వం తీసుకు వస్తున్నట్లు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు అన్నారు. మండల కేంద్రంలోని బాలాజీ రైస్ మిల్లు ఆవరణలో గురువారం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ బియ్యం, కందిపప్పు తక్కువ ధరలకు అందించేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

రైతుబజార్లలో తగ్గింపు ధరల స్టాళ్లు ప్రారంభం

తెనాలి: పట్టణంలోని గాంధీనగర్, గంగానమ్మపేట రైతుబజార్లలో తగ్గింపు ధరలకు బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాలను తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్ గురువారం ప్రారంభించారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు తగ్గింపు ధరల దుకాణాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. సామాన్య ప్రజలకు నిత్యావసర సరుకులు అందుబాటులో ఉండే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల నేపథ్యంలో కిలో కందిపప్పు రూ.160, అలాగే బియ్యం (స్టీమ్ బీపీటీ) కిలో రూ.49, సన్నరకం బీపీటీ రూ.48లకు ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తరుపున పావులూరి రాంబాబు, కమిషన్ మర్చంట్స్ అసోసియేషన్ నుండి సుగ్గుల వెంకటప్పయ్య, అద్దంకి మోహన్, డెప్యూటీ తహసీల్దార్ జేవీఎస్ఎన్ మూర్తి, ఏఎస్‌ఓ పి.వాణి, రైతు బజార్ అధికారి టి.రామకృష్ణ పాల్గొన్నారు.



పంపిణీని ప్రారంభించిన ప్రఖర్‌జైన్

ఫైరింగ్ విభాగంలో శ్రీవల్లికి రజతం

నరసరావుపేట రూరల్: అనంతపురంలో ఈనెల 1నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన రెండు తెలుగు రాష్ట్రాల టీఎస్‌సీ–ఐజీసీ సెలక్షన్ క్యాంపులో నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల క్యాడెట్ పి.గీతాసాయి శ్రీవల్లి ఫైరింగ్ విభాగంలో రజత పతకం సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. క్యాంప్ ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో ఏపీ, తెలంగాణ ఎన్‌సీసీ డైరక్టరేట్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ కల్నల్ సంజయ్ గుప్తా చేతుల మీదుగా పతకం అందుకున్నట్లు వివరించారు. గీతాసాయి శ్రీవల్లితో పాటు జగదేశ్వరి తదుపరి క్యాంప్‌కు ఎంపికైనట్లు తెలిపారు. పతకం సాధించిన గీతాసాయి శ్రీవల్లిని కళాశాల చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, అధ్యాపకులు అభినందించారు.



పతకం సాధించిన గీతాసాయి శ్రీవల్లిని అభినందిస్తున్న కళాశాల చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

పిడుగురాళ్ల: అప్పులు పూర్తిస్థాయిలో తీర్చలేకపోయానన్న మనస్తాపంతో వ్యక్తి మద్యంలో పురుగుమందు కలుపుకొని తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పిడుగురాళ్ల పట్టణంలోని ఆదర్శనగర్ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించిన పట్టణ ఎస్ఐ పఠాన్ రబ్బానీఖాన్ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని లెనిన్‌నగర్‌కు చెందిన షేక్ ముజావర్ చిన్న మస్తాన్(58) గత ఆరేళ్ల క్రితం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ... తనకు తెలిసిన ఓ వ్యక్తికి రూ.50 లక్షలు అప్పుగా ఇచ్చాడు. అయితే అప్పు తీసుకున్న వ్యక్తి మరణించడంతో మస్తాన్ మరికొంత మందివద్ద తీసుకొన్న అప్పుతీర్చేందుకు తన రెండు ఎకరాలను అమ్మి కొంతమేరకు తీర్చాడు. అయినా మరికొంత అప్పు ఉండటంతో మనస్తాపానికి గురై మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలోనే గురువారం ఉదయం ఆదర్శనగర్ సమీపంలో వెంకటేశ్వర్లుకు చెందిన ప్లాట్ల సమీపంలో మద్యంలో పురుగుమందు కలుపుకొని తాగి అక్కడే చనిపోయాడు. స్థానికుల సమాచారం మేరకు పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి కుమారుడు షేక్ ముజావర్ కాలేషావలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య ముజావర్ మీరాబీతోపాటు, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.



ఆత్మహత్య చేసుకున్న షేక్ ముజావర్ మస్తాన్